# ముసురు

ద్వారబంధానికి భుజం ఆనించి నిలబడి. తలమీంచితిప్పుకున్న పైటకొంగుని మునిపంట నొక్కిపట్టి, సమాంతర దూరాల్లో చూరునుంచి ఏకధారగా పడుతూన్న వాననీటిని తదేకంగా కన్నార్పకుండా చూస్తోంది పంకజం. ఎడతెరిపి లేకుండా రెండుగంటల్నుంచీ జోరుగా పడుతోంది వర్షం. పెరట్లో మోకాలు లోతునీళ్లు నిలిచిపోయాయి. సన్నజాజి పందిరి బాగా క్రిందకు వంగిపోయింది. అరటి ఆకులన్నీ చిరిగిపోయి, రిబ్బన్లలా వేల్లాడు తూన్నాయి. గులాబీపూల రేకులు రాలిపోయి, పీటిలో దోనెల్లా గంట క్రితమే కొట్టుకు పోయాయి.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారని లైటుఆర్పేసి, బెడ్‌లైట్ వెలిగించింది పంకజం. ఆఫీసులో పనుండిపోయిందో, లేక వర్షం కారణంగానో భర్త యింకారాలేదు. ఉన్నట్టుండి జల్లుకొట్టి, ముఖం అంతాతడిసి, ఒళ్లు తిమ్మిర్లెక్కుతోంది. చక్కిలిగింతలు పెట్టి నట్లయి, లోలోనే నవ్వుకుంది పంకజం. పిల్లలిద్దరూ రగ్గులు కప్పుకుని, హాయిగా నిద్రపోతున్నారు. 'అదృష్టవంతులు— తీరక, మనసుని పిండేకోరిక అంటూ ఏదీ వుండదు వాళ్లకి' అనుకుంది.

నిలువునా కురుస్తోంది వర్షం. నిలిచిన నీటిమీదపడ్డ వానచినుకులు చక్కటి చప్పుడు చేస్తున్నాయి. ఆ నీటిమీద చౌదరి రూములోని లైటు కాంతి వారగావేసిన తలుపుల సందులోంచి సన్నగా, పొడుగ్గాపడుతోంది. ఆ కాంతిలో చినుకులు బంగారు సూదుల్లా భాసిస్తున్నాయి.

నీటిమీద పెద్దకాంతి పడటంతో ఉలిక్కిపడి చటుక్కున అటు చూసింది పంకజం. సైకిల్ లైటు రానురాను పెద్దదైనీటిమీద పడుతోంది. ప్యాంటు కాళ్లు మోకాళ్లవరకు మడిచి, రైనుకోటు, టోపీధరించి, నీటిలో బలంగా అడుగులు జరుపుతూ వచ్చాడు శివరావు, సైకిల్ నడిపించు కుంటూ. అతను యింట్లోకి అడుగుపెట్టేలోగానే తువ్వాలుతో సిద్ధంగా వుంది పంకజం.

శివరావు బట్టలు మార్చుకుని, వచ్చేలోపల వేడివేడిగా దోసెలు వెయ్యసాగింది.

"మరి నువ్వో?" అన్నాడు శివరావు ముక్కతెంపి, నోట్లో పెట్టుకోబోయి, ఆగి.

"మీరు కానీండి— నేనుతరవాత తింటాను."

"చూశావా, మనవాళ్లు శనివారాలు అనేవి పెట్టడం ఎంత మంచి దయ్యిందో! ఈ రోజు శనివారం కాకపోతే ఇలా వేడివేడి దోసెలు కాకుండా చల్లటిఅన్నం పడేసేదానివి కదా నామొహాన" నవ్వాడు.

పంకజం కూడా నవ్వేసింది.

"ఈవర్షం యింక తగ్గేలా లేదు. పైగా ఎక్కువవుతోందోయ్" చేతులు తుడుచుకుని, గుమ్మదగ్గర నిలబడి, వంటింటిలో భార్యనుద్దేశించి అన్నాడు.

కిటికీ దగ్గరగా మంచం జరుపుకుని, 'హమ్మయ్య' అంటూ దాని మీదవాలి, కిటికీలోంచి వాననిచూస్తూ, వెల్లకిలా చేతులుతలకింద పెట్టు

కుని పడుకున్నాడు. ఆ వాతావరణం ఒకసారి అనిర్వచనీయమైన ఆనందంగానూ, ఒకసారి ఎందుకో తెలియని బెంగగానూ వున్నట్లుంది అతనికి.

ఫలహారం అయ్యాక, వంటిల్లు కడుక్కొని వచ్చి, భర్త పక్కనే నడుంవాల్చింది పంకజం.

"ఈరోజు యింత ఆలస్యమయిందేమండీ?" భర్తకు దగ్గరగా జరుగుతూ అంది.

"ఈవాళ ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వుంది. అందువల్ల...." బయటకు చూస్తున్నాడు శివరావు, మెరుపుల్ని చూడడమంటే అతనికి అంతులేని ఇష్టం.

అయిదు నిమిషాలు గడిచాయి, అలారం టైంపీసు ఆగకుండా 'టిక్‌టిక్' మంటోంది. బయటవాన పడ్తూన్నశబ్దం జోకొడుతున్నట్లుగా వుంది.

శివరావు మెడకింద చేతులు సర్దుకున్నాడు.

"మీకేం మగమహారాజు.... హాయిగా పగలల్లా ఆఫీసులోనో, బయటో, కాలక్షేపం చేసొస్తారు" అంతకంటే నెమ్మదిగా గొణిగినట్లు అనడం ఆమెకు చేతకాలేదు.

శివరావు ఎందుకో చిన్నగా నవ్వుకున్నాడు. ఆమె అలా అనడం చాలా ముద్దుగా అనిపించింది అతనికి. ఇంకాయింకా అలాగే మాట్లాడితే బావుండు ననిపిస్తోంది.

"నేనింటి దగ్గర ఛస్తున్నాను.... ముఖ్యంగా ఈ చౌదరిగాడు ఆ రూములోంచి పోయేదాకా నాకు మనశ్శాంతి వుండదు. వాడి వెధవ చూపుల్తో ఒళ్లు చచ్చి పోతోంది".

—అదిరిపడి, భృకుటిముడిచి విసురుగా తలని భార్యవైపు విసిరాడు శివరావు.

ఆకాశం పెద్దగా పురిమింది. బహుశా పిడుగు పడివుండొచ్చు కూడా ఎక్కడో. కోటి క్యాండిల్స్ బల్బు వెలిగినట్లు మెరుపు. వెంటనే పెద్దకొమ్మ ఫెళఫెళ విరిగిన శబ్దం....కటిక చీకటి. కరెంటు పోయింది భార్య ముఖం కనిపించడం లేదు శివరావుకి. అల్లాగే చూస్తూ చాలా సేపు వున్నాడు శివరావు. ఆమె ఏమీ మాట్లాడలేదు. కొంచెం సేపటికి ఆమె నిద్ర పోతున్నట్లు గ్రహించాడు. అతను మాత్రం అలాగే కళ్లుతెరచి, బయటకు చూస్తూ రాత్రింతా వుండిపోయాడు. రాత్రింతా ఏకధారగా కురుస్తూనే వుంది వర్షం.

.... .... .... .... ....

తెల్లారేక భర్తని 'నిద్ర' లేపుతూ నవ్వింది పంకజం. శివరావు నవ్వ లేక పోయాడు. కారణం- ఆసమయానికి రోజూలాగ అతను నిజంగా నిద్రపోవడం లేదు కాబట్టి.

వర్షం కొద్దిగా తెరిపిచ్చింది. పెరట్లోనీరు తీసిందిగానీ, యింకా బురదగానేవుంది. భర్త ముఖం కడుక్కోవడానికి కుళాయి దగ్గర పెద్దగిన్నెలో వేన్నీళ్లపెట్టి, గుమ్మందగ్గర నిల్చొంది పంకజం. నెమ్మదిగా లేచాడు శివరావు. ఒళ్లు, కళ్లుకూడా బరువుగా వున్నాయి. ముని వేళ్లతో జుట్టుపైకి తోసుకుని, బ్రిష్, పేస్టు తీసుకుని గది బయటకు బయల్దేరాడు.. భార్య వెనగ్గా వచ్చి ఆగిపోయి, ఆమె భుజాల మీదుగా బయటకు చూసాడు.

తన రూము గుమ్మంలో నిల్చొని, పళ్లు తోముకుంటున్నాడు చౌదరి. గళ్లలుంగీ, బొమ్మల చొక్కా....ఇరవైరెండేళ్ల చౌదరి ఆ బట్టల్లో యింకా కుర్రాడిలా కనిపిస్తున్నాడు. అతను బ్రిష్ చేసుకోవడం తను మొట్టమొదటిసారిగా చూస్తూన్నాడు. వెనక్కి తలతిప్పి, గడియారం వైపు చూసాడు. ఈరోజు తనని త్వరగా లేపింది పంకజం.

చటుక్కున తలతిప్పిన చౌదరి పంకజాన్ని, ఆమె వెనక శివ రావుని చూసి, గబగబ బాత్‌రూంలోకి వెళ్లిపోయాడు.

"మీకు వేన్నీళ్లు పెట్టానండీ" అంటూ భర్తనుద్దేశించి గట్టిగా అంటూ వెనక్కి తిరిగిన పంకజం-వెనకే నిల్చున్న భర్తని చూసి, ముందు ఆశ్చర్యపోయి, తర్వాత నవ్వేసింది.

"ఈ రోజు ఆదివారం కదా - ఈ వేళావెళ్లాలా ఆఫీసుకి?"- స్నానం చేసొచ్చి తలదువ్వుకుంటూన్న భర్తతో అంది పంకజం.

"చెప్పానుగా ఇన్‌స్పెక్షన్ జరుగుతోందని. ముఖ్యమైన పనుంది."

"ఈ రోజు త్వరగావచ్చేస్తారా ఇంటికి?" భోజనం అయ్యాక చెయ్యి కడుక్కోవడానికి నీళ్లందిస్తూ అడిగింది.

"చెప్పలేను"

.... .... .... .... ....

ఈ సాయంత్రం కూడా అదే టైముకి అలాగే మొదలయ్యింది వాన, పంకజం అలాగే నిల్చునివుండగా అదేటైముకి ఇంటికి వచ్చాడు శివరావు. ఇంట్లోకి అడుగుపెట్టూనే చౌదరి రూంవైపు చూశాడు. ఓర వాకిలి తలుపుల మధ్యనుంచి సన్నగా పొడుగ్గా నేటిమీద పడుతోంది కాంతి.

—"ఈరోజు ఆదివారం కదా—చల్లటి అన్నమే" అని నవ్వింది పంకజం, అన్నం వడ్డిస్తూ.

"....................................."

"నిన్నరాత్రినుంచీ మౌనంగా వున్నారు మీరు."

"....................................."

భోజనం అయిందనిపించాడు శివరావు.

"రాత్రి చౌదరిగురించి చెప్పి, మీమనస్సుని బాధపెట్టాను కదూ?" భర్తకి అనుకుని పడుకుంది.

— ఓ క్షణం పోయాక భార్యవైపు తిరిగి ఆమెముఖంలోకే చూశాడు శివరావు.

"మీమనసుని కష్టపెడితే క్షమించండి. కానీ.... నేను మీతో తప్పితే ఎవరితో చెప్పకోను చెప్పండి" అంటూండగానే ఆమెగొంతు బొంగురుపోయింది. బెడ్ లైట్ వెలుతుర్లో ఆమెకళ్లల్లో చెమ్మ మెరుపు గమనించాడు శివరావు. అప్రియత్నంగానే ఆమెనడుంమీద చెయ్యేసాడు.

"మీరు ఆఫీసుకి వెళ్ళినప్పట్నుంచీ ఆ గుమ్మంలోనే తచ్చాడుతాడు. పెరట్లోకి వెళ్లాలంటేనే సిగ్గుపడి ఛస్తున్నాను. ముఖ్యంగా సాయంత్రం నాలుగ్గంటలకి స్నానంచేయ్యడం నాకు అలవాటు కదా. సరిగ్గా ఆ సమయానికి కళ్లు తాటికాయల్లా చేసుకుని, ఆ గుమ్మంల్లోనే జండాలా నిల్చుంటాడు. ఒక్కోసారి పిచ్చిపిచ్చి పాటలు కూడా పాడతాడు. పొద్దున్న మీరు లేచేవరకు కూడా అసహ్యకరమైన చేష్టలు చేస్తాడు. స్కూల్నుంచి అయిదుగంటలకి పిల్లలొచ్చేవరకూ నాకు నరకమే" అంటూ భర్త గుండెలమీద ముఖం దాచుకుంది పంకజం.

ఆమెముఖాన్ని గుండెలకు అదుముకుని, జుట్టులోకివేళ్లు పోనిచ్చి, నిమురుతూ, కళ్లు మూసుకుని, ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా తలాడిస్తూ, నిట్టూర్పు విడిచాడు శివరావు.

.... .... .... .... ....

స్నానం చేసి, చీరచుట్టబెట్టుకుని, బాత్ రూంలోంచి బయటకు వచ్చి, చొదరి రూమువైపుకసిగావుమ్మి, ఇంట్లోకివెళ్లబోయిన పంకజం. రెండు చేతులూ పైకెత్తి పై గుమ్మాన్ని పట్టుకుని, నిటారుగా నిల్చుని, అదోలా నవ్వుతూన్న భర్తని చూసి, నిర్ఘాంతపోయింది. తేరుకోవడానికి రెండు నిముషాలు పట్టింది.

"అదేవిటీ, అప్పుడే వచ్చేసారేం?"

మెట్లుదిగి ఆమె వైపు వస్తూ, "ష్, చెప్తాగానీ— నువ్వు అటు

వైపునించి వంటింటిలోకి రా.... ముందు గదిలో వెళ్ళిండున్నారు" అన్నాడు శివరావు. ఆమె గబగబా ప్రక్కనందు గుండా వంటింటిలోకి వచ్చింది.

"చౌదరి రూము తాళం వేసుంది కదా—అలా కసిగా వుమ్మే వెందుకూ ఆ రూమువైపు?" ఆమె వెనగ్గానే వచ్చిన శివరావు నవ్వుతూ అడిగాడు గొంతుతగ్గించి.

"ఆఁ.... ఈరోజే ఎక్కడికో చచ్చాడు. అందుకనే ఆ కసంతా అలా చూపించాను వెధవ్వ"—ముందు తడబడి, ఆ తర్వాత విజయ గర్వంగా అంది పంకజం.

అలవోకగా నవ్వేడు శివరావు. "రోజూ యిలా చీర సగం సగం చుట్టుకునే వస్తావా?" అని అడుగు ధామనుకున్నాడు గానీ మాను కున్నాడు. "ఆఁ....త్వరగా చీర మార్చుకునికి, మూడు కాఫీలు పటా అన్నాట్లు, పిల్లలేరీ?"

"ఆడుకోవడానికి పోయారు. మీరుపదండి. రెండు నిముషాల్లో తెస్తున్నా కాఫీల్లు".

గబగబా కాఫీ తయారుచేయడంలో నిమగ్నురాలై పోయింది పంకజం. భర్త మూడు కాపీలు తెమ్మన్నాడు గానీ, ఇద్దరిగొంతులే వినిపిస్తున్నాయే. అందులో ఒకటి భర్తది. 'మూడో మనిషి ఉత్తపిడత కింద పప్పేమో' అనుకుంది పంకజం లోలోనే నవ్వుకుంటూ. చేతిలో మూడు కాఫీలు పేర్చి, తలవంచుకుని ఆ ముగ్గురిమధ్యగా టీపాయ్‌మీద పెట్టి, లోపలకు వచ్చేసింది.

"ఇదిగో—ఓసారిలా రా. వీళ్లకు పరిచయం చేస్తాను." అంటూ పిలిచాడు శివరావు. బయటకొచ్చి తలవంచుకుని నిల్చుంది పంకజం.

"ఈవిడ మిసెస్ పంకజం శివరావ్. ఆయన రాజుగారు" నమస్కారాలయ్యాక తలదించుకుంది పంకజం.

"ఇంక మీ యిద్దర్నీ పరిచయం చేయనక్కర్లేదనుకుంటా రోజూ చూస్తున్నవాళ్ళేగా. అయినా ఫార్మాలిటీ కోసం —— ఈవిడ మిసెస్ పంకజంశివరావ్. వారు చౌదరిగారు"

—తటాలున తలెత్తిన పంకజం నిర్విణ్ణురాలై పోయింది, ఎదుటి మనిషిని చూసి. కొంచెం సర్దుకుని, "నమస్కారమండీ" అన్నాడు చౌదరి బెరకుగా.

—— నోట మాటరాలేదు పంకజానికి. కళ్ళు తిరిగితున్నట్లయ్యింది. లోపలకు వచ్చి మంచం మీద వాలిపోయింది.

"పెద్దగా చదువుకోలేదు మా ఆవిడ. సంసారపక్షం. అంతే." అని నవ్వాడు శివరావు.

.... .... .... .... ....

వంటింటిలో కంచాలు సర్ది లైటు వెలిగించి వుంచి, బయటిగదిలో బెడ్ లైటు వెలుతుర్లో కుర్చీలో ముడుచుక్కూర్చుంది పంకజం.

"చీకట్లో కూర్చున్నావేంటి పంకజం? లైటు వెలిగించుకోక పోయావా? ఓహో— పిల్లలు నిద్రిపోయారా? ఆఁ.... అన్నట్లు నువ్వు భోజనం చేసావా?.... రండిమాష్టారూ" — ఫస్ట్ షో సినిమా చూసి, లోపలకు వస్తూ అన్నాడు శివరావు. అందులో జవాబు నాశించిన ప్రశ్న లేవీ వున్నట్లుగా అనిపించలేదు పంకజానికి. పైటఒంటినిండా కప్పుకుని గబగబా వంటింటిలోకి వెళ్ళిపోయింది.

తలవంచుకుని, మొహమాటపడుతూ, ఇబ్బందిగా లోపలికొచ్చాడు చౌదరి. "శివరావుగారూ— మీరు ఏమీ అనుకోకపోతే, మనమే వడ్డించు కుందాం" నసుగుతూ అన్నాడు.

"ఏఁ! ఏఁ! ఫరవాలేదండీ— మా ఆవిడ ఒప్పుకోదు."

"అదికాదండీ— ప్లీజ్.... నాకొంచెం.... ఉఁ...."

"మొహమాటవాఁ? ఆల్ రైట్. మీరు కాళ్లు కడుక్కురండి."

కుళాయి వైపునడిచాడు చౌదరి

శివరావు ఛలోక్తులకు నవ్వుతూ, మొహమాటపడుతూనే భోజనం ముగించాడు. అప్పుడే చూసొచ్చిన సినిమా గురించి కూడా చర్చించు కున్నారు. బయటగదిలో పంకజం సిగ్గుతో చచ్చిపోతోంది. పరిస్థితి ఏమీ అర్థం కావడంలేదు. ఇంతలో రోజులాగే మళ్లీ వర్షంమొదలయ్యింది. భోజనాలు ముగిసాయి.

"చౌదరిగారూ! ఇంక ఈ వర్షంలో ఏం వెళ్తారు? సామానంతా కూడా తడిసిపోతుంది రూములోనేవుండిపోయి తెల్లారేక వెళ్లడం మంచి దనుకుంటా" అన్నాడు శివరావు బయటకు చెయ్యిచాపి, వర్షం ఎంత పడుతోందో చూసి.

"అదే, కసేపుచూసి, పరిస్థితులను బట్టి ఆలోచిస్తా థేంక్సు మీ ఆతిధ్యానికి" చిరునవ్వు చిందిస్తూ అన్నాడు చౌదరి

"అయ్యో— యింతోటి ఆతిధ్యం"

"వస్తానండి" అని వెనక్కితిరిగి, అక్కడ పంకజం లేకపోవ డంతో, "ఆవిడకూ్కడా చెప్పండి" అని తనరూములోకి వెళ్లిపోయాడు చౌదరి.

—వర్షం జోరుహెచ్చింది. రోజూకంటే బాగా ఎక్కువగావుంది. వంటిల్లు కడిగి వచ్చి, భర్తప్రక్కనే కొంచెం ఎడంగా పడుకుంది పంకజం.

పది నిముషాలు మౌనంగా గడిచాయి. బెడ్ లైటు కూడా ఆరి పోయింది—కరెంటు పోయింది. లేచి తడుముకుంటూవెళ్లి కిరోసిన్ దీపం వెలిగించి తెచ్చిభర్త ప్రక్క కిటికీలో పెట్టిపడుకుంది,

"నువ్వెందుకు భోజనం చెయ్యలేదు?"

"ఏం లేదు కడుపు నిండుగా వుంది ఆకలిలేదు"

—పై ప్రశ్న భర్త వేస్తే క్రింద జవాబు తను చెప్పుదామనుకుంది. కాని, అతను అడగలేదు. ఆమె చెప్పలేదు. మరో పదినిముషాలు మౌనంగా మని అయిపోయాయి

"పంకజం" ప్రశాంత గంభీరంగా పిలిచాడు శివరావు.

"ఊఁ" అందామనేది ఆమెఉద్దేశ్యం. ధ్వని బయటకురాలేదు.

"పంకజం" రెట్టించాడు.

"ఊఁ" —ఈసారిధ్వని వినిపించింది అతనికి.

"నేను చదువుకునే రోజుల్లో విజయవాడలో వుండేవాడినని నీకు చెప్పాను కదూ?"

"ఊఁ"

"ఆ రోజుల్లో గవర్నరుపేటలో ఒక ఇంటిలో రూము అద్దెకు తీసుకుని వుండేవాడిని నేనుకాక ఆ యింటిలో రెండు పోర్షన్లువుండేవి. నాగదికే ఆనుకుని వున్న పోర్షన్‌లో ఒక చిన్న సంసారం వుండేది. భార్యభర్తలు, ముచ్చటగా యిద్దరే పిల్లలు. ఆయన సాధారణంగా క్యాంపుల్లో తిరుగుతూండేవాడు. వీలయినంత ఎక్కువసేపు నేను రూములోనే వుండిపోయి చదువుకునేవాడిని. నేనురూములో వున్న సమయం అంతలోనూ ప్రక్కింటావిడ—అదే ఆ ఇద్దరుపిల్లలతల్లి—నాకు వినిపించేలాపాడేపాటలు-భార్యభర్త దగ్గర పాడడానికి కూడా సిగ్గుపడుతుంది బాత్‌రూంకిగాని, మరెందుకు గాని పెరటిలోకి వెళ్లాలంటే ఏదో వంకతో అడ్డొచ్చే ఆమెను తప్పించుకోవడం బ్రహ్మతరమయ్యేది. కొడుకుని అడ్డెట్టుకుని "చేతకానిదద్దమ్మ"అని, "ఆడంగివెధవ"అని, ఒకటేమిటి ....ఆవిడ నన్నుద్దేశించి రేకెత్తిస్తూ అనేమాటలకు, చేసే చేష్టలకూ అడ్డు ఆదుపూ వుండేదికాదు. నా రూములో తలుపులు బిడాయించుకుని

కూర్చొని చదువుకునేవాడిని. ఆవిడ వెర్రి చేష్టలకు నేనులొంగలేదని—చివరకు నేను కనిపిస్తేచాలు—వుమ్మేసేది. ఒకరోజున వాళ్లాయిన నా రూముకి వచ్చాడు. "శివరావు గారూ- ఈ రూముకి మీరెంత అద్దె యిస్తున్నారూ?" అన్నాడు. చెప్పాను "ఇదే అద్దెకు, వీలయితే యింత కంటే తక్కువకి మీకు మంచి రూము చూపిస్తే వెళ్తారా?" అన్నాడు. మతిపోయిచూసాను ఆయనవైపు. ఆయన చాలాసేపు తలవంచుకుని వుండిపోయాడు. చివరకు లేచి వెళ్లబోతూ, "నేనూ ఒకప్పుడు మీ వయస్సులో వున్నవాణ్ణే కాబట్టి అనుభవంమీద చెబుతున్నాను. సంసారు లుండే పోర్షన్‌తోబాటు బేచిలర్లు వుండటం అంతమంచిదికాదు. ముల్లు వచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకేవచ్చి ముల్లుమీదపడ్డా-అపవాదు ఎప్పుడూ ముల్లుకే. తర్వాత మీయిష్టం" అనివెళ్లిపోయాడు ఆ మర్నాడే నేను రూము మార్చేశాను. అలాతెలివిగానాకు చెప్పకుండా ఆయననన్నేమైనా అనివుంటే, ఆయనంత మూర్ఖుడయిన మగవాడు యీ లోకంలో యింకొకడు వుండేవాడా అని యిప్పుడు అనిపిస్తోంది పంకజం"

—సంభ్రమాశ్చర్యాలతో పంకజం భర్త ముఖంలోకి చూసేలోగా శివరావు 'వుఫ్' మని దీపం వూదేసి, అటువైపు వత్తిగిల్లి కళ్లు మూసుకున్నాడు.

కటిక చీకటిలో కళ్లు తెరుచుకు వెల్లకిలాపడుకున్న పంకజానికి చీకటిక్రమేపీ అలవాటయి కళ్లు కనిపిస్తున్నాయి

వత్తిగిల్లి పడుకున్న శివరావుకి మధ్యాహ్నం జరిగిన సంఘటన గుర్తొస్తోంది—

.... .... .... .... ....

ఆఫీసుకు వచ్చేడన్నమాటేగాని, శివరావుకి పనితోచట్లేదు. అసలుమనసు మనసులో లేదు చౌదరే మనసంతా కదులుతున్నాడు భార్య

చెప్పినమాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి. టైము చూసుకున్నాడు. "ఆ టైముకి నేనుఇంటిదగ్గర వుండాలి" అనుకుని, పర్మిషన్ తీసుకుని బయల్దేరాడు.

నాలుగువుతూన్నా ఇంకా ఎండ తీవ్రంగావుంది. మనసుబాగులేక పోవడం వలన మరింత చికాకుగా వుంది శివరావుకి సైకిల్ నెమ్మదిగా తొక్కుతూ తీవ్రంగా ఆలోచిస్తూ వస్తున్నాడు. కొండపక్కగా వస్తూండగా ఎవరిదో పరిచయస్థుల గొంతువినిపించి, ఆగి, ఎండకు చెయ్యి అడ్డం పెట్టుకుని, రాళ్లపైకి చూశాడు. ఆశ్చర్యపడి కళ్లు నులుముకుని మళ్లీ చూశాడు సైకిల్‌కి స్టాండువేసి, పైకి నడిచాడు.

"నమస్కారమండీ"

"నమస్కారమండీ — ఇదేవిటి చౌదగారూ ఇక్కడ చదువు కుంటున్నారు?"

"ఏంలేదండీ — ఈకొండనీడనచల్లగా వుంటుందని, బైది బై.... ఈయన మా ఫ్రెండురాజుగారు. ఆయన శివరావుగారు. మాకాంపౌండులో నా గదిపక్క పోర్షన్‌లో వుంటున్నారు."

"నమస్కారం"

"నమస్కారం. ఈ రోజేకాదులెండి. మావాడు రోజూ యింతే. పొద్దున్న పదిగంటలకు పుస్తకాలు పుచ్చుకుని బయటపడతాడు. మళ్లీ చీకటి పడ్డాకే రూముకి వెళ్లడం. అప్పటిదాకా పార్కులోనో, ఇక్కడో చదువు. హాయిగా తన రూముకి వెళ్దాం అంటే వద్దంటాడు. పోనీ మా యింటికిరా గురూ అంటే మీలాకాలనీ గోలగావుంటుందీ. అంటాడు. ఇప్పుడు ఫర్వాలేదుగానీ—వానపడితే వుంటాయి సార్ మా పాట్లు" అంటూ నవ్వాడు రాజు.

చౌదరి తలవంచుకుని, పుస్తకాల్లోకి చూస్తున్నాడు మొహమాటంగా. ఓ నిమిషం పోయాక, "కూర్చోండి సార్" అన్నాడు శివరావుని.

చౌదరిమీద అమితమయిన అభిమానం కలిగింది శివరావుకి. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా కూర్చుండి పోయాడు.

"ఈ రోజు.... నేను రూముఖాళీ చేస్తున్నాను శివరావుగారూ"

ఉలిక్కిపడ్డట్టు చూశాడు శివరావు. చిన్నగా నవ్వాడు చౌదరి.

"అదేం....?" అని మాత్రం అనగలిగాడు శివరావు.

"ఆఁ....ఏం లేదు....ఈ కొండ వెనక ఒకమేడగది దొరికింది, గాల్లీ, అదీ బాగుంటుందని...."

శివరావు మౌనంగా వుండిపోయాడు. ఓ నిముషం పోయాక, "మావల్ల మీకేదైనా ఇబ్బంది కలుగుతూంటే చెప్పండి" అన్నాడు, చౌదరి ముఖకవళికలను గమనిస్తూ.

"అబ్బెబ్బే....అదేంలేదండీ....బహుశా మాఫ్రెండు యింకొకతను కూడా నాతో బాటు యిప్పుడు నేనుతీసుకోబోయే రూములో వుంటాడు. ఇద్దరం బేచిలర్స్‌మే కాబట్టి.... మేడమీదిగది ....ఎవరికీ యిబ్బంది లేకుండా వుంటుందని...."

"ఈ రోజే వెళ్లిపోవాలా?" శివరావుకి చాలాబాధగా వుంది.

"ఈ రోజే వస్తానని చెప్పాను వాళ్లకి. సామానేమీ లేదుగా సర్దుకోవడానికి, అయిదు నిముషాల్లో వెళ్లిపోవచ్చు" నవ్వేడు చౌదరి.

శివరావు తిరిగి నవ్వలేకపోయాడు. రెండు నిముషాలు పోయాక అన్నాడు, "ఓ విధంగా ముందు తెలియడం నా అదృష్టం. ఇప్పుడు మిమ్మల్నినేనో చిన్న కోరిక కోరతాను. కాదనకూడదు"

ఏమిటన్నట్లు శివరావు ముఖంలోకి చూసాడు చౌదరి.

"ఇన్నాళ్లూ మాతో బాటేవున్న మీతో ఈ ఒక్కపూటా సరదాగా గడిపే ఛాన్సివ్వండి. ఇక్కడకు దగ్గరే కాబట్టి ముందు మా ఇంటికివెళ్లి, కొంచెం కాఫీ తీసుకుని, అక్కణ్ణుంచి సరదాగా బజార్లోతిరిగి, ఫస్ట్ షో

చూసి, మా యింటిలోనే భోజనం చేసేద్దాం. కాదనకండి. ప్లీజ్ రాజు గార్వూ, మీరుకూడా. ప్లీజ్" బ్రతిమలాడుతున్నట్లువుంది శివరావు ధోరణి.

"క్షమించండి. ఇప్పుడు అలాంటివేమీవద్దు. మళ్లీ తప్పకుండా వస్తాను" మొహమాట పడిపోయాడు చౌదరి.

పుస్తకాలుమడిచి, దొంతరగాపెడుతూ గబగబా అన్నాడురాజు, "మధ్యవర్తిగా నేను చెప్పేది మీరిద్దరూ వినాలి. మనం ముగ్గురం ఇప్పుడు శివరావుగారింటికివెళ్తాం. వారింట్లో కాఫీలు తాగేస్తాం. హాయిగా హుషారుగా బజారుకి వెళ్లిపోతాం ముగ్గురం. అక్కణ్ణుంచి ఒక బ్రహ్మాండమయిన, ముఖ్యమయిన, తప్పనిసరయిన పనిమీద నేను ఇంటికి పోతాను. మీరిద్దరూ సినిమాకు వెళ్తారు. ఆతర్వాత వాళ్లింట్లోనే చౌదరికూడా భోజనం చేసేస్తాడు. ఆ తర్వాత రూంమార్చేస్తాడు. నో మోర్ అల్టరేషన్స్ ప్లీజ్."

..... ..... ..... .....

శివరావుకి మంచి నిద్రపట్టేసింది రాత్రింతా.

"ఎనిమిదయ్యింది. రోజూ కంటే గంటన్నర సేపు ఎక్కువగా పడుకున్నారు. ఇక లేవండి" అంటూ తట్టింది పంకజం.

బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ, సగం తెరిచిన కళ్లతో భార్యను చూసి—కళ్లు పెద్దవిగా తెరచి, విస్తుపోయాడు శివరావు.

"ఇదేవిటీ?!! వాలుజడా, కోలబొట్టూ కదూ నీకిష్టం?—ఈ మార్పు ఏమిటీ?!" పట్టపగలు చుక్కలు పొడిచినంతగా ఆశ్చర్య పోతున్నాడు.

"కానీ—ముడీ, గుండ్రటి బొట్టు మీకు యిష్టం. నేనందంగా కనిపించవలసింది —నాకూ, ఊళ్లోవాళ్లకీకాదు— నా భర్తకు. పైగా.... నేను... ఇద్దరుపిల్లలతల్లిని" ఓరగా నవ్వి, బ్రష్షూ, పేస్టూ అందించింది భర్తకు.

ఆశ్చర్యపోతూనేలేచి. లుంగీ సరిగ్గా కట్టుకుని, బ్రెష్షూ, పేస్టూ అందుకుని, గబగబా గది బయటకు నడిచాడు శివరావు. చూపు త్వరగా చౌదరి రూము వైపుమళ్ళింది. రూముకి గొళ్ళెంపెట్టుంది.

'గది అద్దెకు ఇవ్వబడును' అనే బోర్డుతో గేటువైపు వెళ్తూ, ఖుంటాయన విష్ చేస్తూ నవ్వాడు.

"ఏంతి సాన్నాలూ! ఆ లూములో వుందే అంకుల్ లేలేం?" అన్నాడు చంటాడు.

"రూము ఖాళీ చేసి వెళ్ళిపోయారా!— ఆ రూము కూడా మనమే తీసుకుందామా అనుకుంటున్నానూ" తనలో అనుకుంటున్నట్లు అన్నాడు శివరావు, సాలోచనగా.

జ్యోతి జనవరి '80.

(కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ)

24399
22.5.02